ఆసుపత్రి ప్రసవాలకు పారితోషికం

పార్వతీపురం : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవించిన గర్భిణీలకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా నిర్దేశించిన పారితోషికం సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావు సూచించారు. ఈ మేరకు జిల్లా ఆరోగ్య కార్యాలయంలో సీనియర్/జూనియర్ సహాయకులకు అవగాహన శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వీరికి సంబంధించి ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా అర్హులకు ఈ పథకానికి సంబంధించి ఆన్‌లైన్ చేయు విధానం పై జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ అప్పారావు శిక్షణను ఇచ్చి అవగాహన కల్పించారు. రెండు ఆరోగ్యశ్రీ అకౌంట్స్ - ఒకటి ప్రసవించిన గర్భిణీకి, రెండవది పిహెచ్‌సికి ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి అవసరమైన డాక్యుమెంట్లను వివరించారు. డెలివరీ అయిన వారి వివరాలు స్టాఫ్ నర్స్/మిత్ర లాగిన్ ఆన్‌లైన్ నమోదు చేస్తే, ఆ వివరాలు మెడికో లాగిన్ లోకి వస్తాయని, గర్భిణీకి ఆరోగ్యశ్రీ కార్డు తప్పనిసరిగా ఉండాలని అన్నారు.

మొక్కు తీర్చుకుంటున్న మహిళ

సిరిమానోత్సవానికి హాజరైన జనం

పైడితల్లమ్మ ఆలయానికి ఘటాన్ని తీసుకొస్తున్న చిన్నారి

అంబరాన్నంటిన సిరిమాను సంబరం

- లక్షలాది మంది హాజరు
- పైడితల్లమ్మ దర్శనానికి పోటెత్తిన జనం
- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి బొత్స
- అమ్మవారిని దర్శించుకున్న ఐటి మంత్రి అమర్‌నాథ్, ఎమ్‌పి బెల్లాన, ఎమ్మెల్యేలు

సిరిమానుకు దండం పెడుతున్న మంత్రులు బొత్స, అమర్‌నాథ్, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ఉత్తరాంధ్రుల కల్పవల్లి, విజయనగరం పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ సంప్రదాయాలు, ఆచారాలకు అనుగుణంగా ఉత్సవాన్ని మంగళవారం జిల్లా యంత్రాంగం ఘనంగా నిర్వహించింది. ఎప్పటిలాగే పాలధార, అంజలి రథం, తెల్లపనుగు, బెస్తవారి వల ముందు నడవగా, పైడితల్లి ఆలయపూజారి బంటుపల్లి వెంకటరావు సిరిమానుపై ఆశీనులై మూడుసార్లు అమ్మవారి ఆలయం నుంచి కోట వరకు ఊరేగారు. ఈ అపూర్వ ఘట్టాన్ని ప్రత్యక్షంగా తిలకించిన భక్తులు పరవశించిపోయారు.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ పైడితల్లమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ఇఒ మంత్రి అమర్నాథ్‌కు అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. డిప్యూటీస్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, విశాఖరేంజ్ డిఐజి హరికృష్ణ, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లి అమ్మవారిని మన్సాస్ సంస్థచైర్మన్, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు, ఆయన సతీమణి సునీలాగజపతి అమ్మవారి పట్టువస్త్రాలు సమర్పించారు. కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, బొత్స అప్పలనర్సయ్య, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, సినీనటుడు సాయికుమార్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, కోట

సిరిమానోత్సవం మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా 4.35గంటలకు ప్రారంభమైంది. హుకుంపేట నుంచి సిరిమాను తరలింపు ఆలస్యం కావడంతో పాటు రథాన్ని సిద్ధం చేయడంలో ఆలస్యం కావడంతో గంటన్నర ఆలస్యంగా ఉత్సవం ప్రారంభమైంది.

ఎస్పి ఎం.దీపిక, కలెక్టర్ నాగలక్ష్మి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి, ఆర్‌జెడి సురేష్‌బాబు, ఆర్‌డిఒ సూర్యకళ తదితరులు సిరిమాను ముందు నడిచారు. అత్యంత ఘనంగా జరిగిన అమ్మవారి సిరిమానోత్సవం సాయంత్రం 6 గంటలకు ముగిసింది.

ఈ ఏడాది అధిక సంఖ్యలో భక్తులు హాజరవుతారని అంచనా వేసిన అధికారులు అందుకు తగినట్లు బందోబస్తును, మూడు అంచెల్లో బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి గంటస్తంభం, బాలాజీ జంక్షన్, గుమ్చీ, అంబటిసత్రం నుంచి ఆలయం వైపు వాహనాలు వెళ్లకుండా నిలుపుదల చేశారు. మధ్యాహ్నం 1గంట వరకు దర్శనాలకు అవకాశం కల్పించారు. నగర ప్రజలే కాకుండా జిల్లా వ్యాప్తంగా వచ్చిన వేలాది మంది అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు.

మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించడమే కాకుండా, పలుచోట్ల తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. తాగునీటి సదుపాయం కల్పించారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా తాగునీరు, ఆహార పదార్థాలను పంపిణీ చేశారు.

సిరిమానోత్సవాన్ని తిలకించిన ప్రముఖులు

సిరిమానోత్సవాన్ని పలువురు ప్రముఖులు ప్రత్యక్షంగా తిలకించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆవరణలో మంత్రి బొత్స సత్యనారాయణ కుటుంబం ఆశీనులై ఉత్సవాన్ని తిలకించింది. ఆయనతో పాటుగా రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖామంత్రి గుడివాడ అమర్నాథ్, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్ బాబు, ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చినప్పలనాయుడు, బొత్స అప్పలనరసయ్య, కంబాల జోగులు ఇతర ప్రముఖులు, అధికారులు సైతం ఇక్కడినుంచే ఉత్సవాన్ని తిలకించారు. మాన్సాస్ చైర్మన్, పైడితల్లి ఆలయ ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు, వారి కుటుంబ సభ్యులు కోట బురుజు పైనుంచి సిరిమాను ఉత్సవాన్ని తిలకించారు.

రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పణ

పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవ నేపథ్యంలో మంత్రి బొత్స సత్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. తన సతీమణి బొత్సఝాన్సీలక్ష్మి, కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో అధికారులు స్వాగతం పలికారు.

సాలూరులో రక్షణభేరి నాయకులకు తిలకందిద్ది స్వాగతం పలుకుతున్న మహిళ

మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

ప్రజా రక్షణ భేరికి అపూర్వ ఆదరణ

- సిపిఎం నాయకులకు ఎక్కడికక్కడ హారతులతో స్వాగతం
- పలు సమస్యలపై వినతుల వెల్లువ
- కొండకోనలు దాటుకుంటూ తరలివచ్చిన గిరిజనులు
- సమస్యలపై పోరాడేందుకు అభయమిచ్చిన నేతలు
- యాత్రలో ఆలోచింపజేసిన కళా ప్రదర్శనలు

సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

పిఎన్‌ఎం కళాకారుడి డప్పు ప్రదర్శన

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి/సాలూరు, సీతానగరం, మక్కువ

పార్వతీపురం మన్యం జిల్లాలో రెండు రోజులపాటు సాగిన ప్రజారక్షణ భేరీ బస్సుయాత్రకు విశేష ఆదరణ లభించింది. దారిపొడవునా మహిళలు హారతులిచ్చి, పూలతో స్వాగతం పలికారు. నాయకులకు తిలకం దిద్దుతూ ఆప్యాయతగా పలకరించారు. కురుపాం, మక్కువ, సాలూరు, మెంటాడల్లో జరిగిన సభలకు గిరిజనులు కొండకోనలు దాటుకుంటూ తరలివచ్చారు. సుమారు 20 కిలోమీటర్ల దూరంలోనున్న మక్కువ మండలం కాముడు వలస నుంచి మూడు నెలలు, ఏడాది చంటి బిడ్డలను ఎత్తుకుంటూ మక్కువలో జరిగిన సభకు కాలినడకన రావడం ఎర్రజెండాపై వారికి ఉన్న నమ్మకానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. యాత్ర సాగిన ప్రతిచోటా స్థానికులు డప్పుల దరువు, గిరిజన సంప్రదాయ నృత్యాలతో అలరించారు. ఎర్రజెండా చేతబూని రెపరెపలాడించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, ఉద్యోగ, కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్దపెట్టున చేసిన నినాదాలు మిన్నంటాయి. యాత్రలో పాల్గొన్న నాయకులు కూడా రాత్రి పూట గ్రామాల్లోనే బస చేస్తూ స్థానికులతో మమేకమై కష్టసుఖాలను తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా తమ సమస్యలు పరిష్కరించాలంటూ యాత్ర రథసారధి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు వివిధ తరగతులవారు వినతులు అందజేశారు. వీటిని స్వీకరించిన ఆయన పరిష్కారానికి చిత్తశుద్ధితో ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచుతామని, అవసరమైనప్పుడు ప్రజాక్షేత్రంలో పాలకపార్టీలను ఎండగట్టేందుకు ప్రజలు కూడా సిద్ధపడాలని కోరారు.

రెండో రోజు యాత్ర సాగిందిలా..

రెండో రోజు ప్రజా రక్షణ భేరి యాత్ర సీతానగరం మండలం చినబోగిలి, మక్కువ, సాలూరు మీదుగా మెంటాడ మండల కేంద్రం వరకు సాగింది. చినబోగిలి ప్రధాన రహదారి నుంచి గ్రామంలోకి స్థానిక ప్రజలు ప్రదర్శనతో స్వాగతం పలికారు. సాలూరులో గాంధీనగర్ జంక్షన్ వద్ద బస్సు యాత్రలో వున్న నాయకుల బృందానికి నియోజకవర్గ సిపిఎం నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రధాన రహదారి మీదుగా బోసుబొమ్మ జంక్షన్ వరకు, మెంటాడ ముఖ ద్వారం నుంచి ప్రధాన రహదారి చివరి వరకు డప్పువాయిద్యాల నడుమ ప్రదర్శన చేపట్టారు. చినబోగిలిలో రైతు సంఘం నాయకులు రెడ్డి లక్ష్మునాయుడు, మక్కువలో సిపిఎం మన్యం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి ఇందిర, సాలూరులో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.అప్పారావు, మెంటాడలో విజయనగరం జిల్లా పార్టీ కార్యదర్శి వి.లక్ష్మి అధ్యక్షతన సభలు జరిగాయి.

సాలూరులో ఆటోనగర్ ఏర్పాటు చేయాలి : విఎస్ఆర్

సాలూరులో ఆటోనగర్ ఏర్పాటు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. లారీ రవాణా రంగంలో విజయవాడ తరువాత అంతటి సంఖ్యలో లారీలు ఉన్న సాలూరులో కనీస సదుపాయాలు కల్పించకపోవడం సిగ్గు చేటన్నారు. మెకానిక్ వర్కుషాపులు, టైర్లు తదితర సామగ్రి అందుబాటులో ఉండే విధంగా సాయపడాలని లారీ ఓనర్లు చాలా కాలంగా కోరుతున్నా పాలకులు పట్టించుకోలేదని విమర్శించారు. దీనికితోడు కేంద్రం అనుసరిస్తున్న మోటార్ వాహన చట్టాల వల్ల కూడా యజమానులు ఆర్థికంగా కుదేలవుతున్నారని తెలిపారు. దీంతో లారీ డ్రైవర్లు, క్లీనర్లు కూడా ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆటోనగర్ కోసం భూమి సేకరించినప్పటికీ ఇప్పటి వరకు నిర్మాణాలు చేపట్టలేదని విమర్శించారు. మూతపడి వున్న జీగిరాం జ్యూట్ మిల్లును వెంటనే తెరిపించాలని డిమాండ్ చేశారు. రూ.4కోట్ల ఖర్చుతో 9వేల ఎకరాలకు సాగునీరందించే గుర్ల గెడ్డ ప్రాజెక్టును పాలకులు గాలికి వదిలేశారని విమర్శించారు. ఇప్పటికైనా దీన్ని పూర్తిచేయకపోతే ప్రభుత్వ భరతం పడతామన్నారు. మెంటాడ మండలంలో అనేక గ్రామాల్లో తాగునీటి సదుపాయం కూడా కల్పించకపోవడం వల్ల గిరిజనులకు ఊటనీరే గత్యంతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

చెరకు రైతులకు మోసం : ఎంఎస్

ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి చెరకు రైతుల్ని మోసం చేసిందని విమర్శించారు. లచ్చయ్యపేట ఎన్‌సిఎస్ సుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం నుంచి చెరకు రైతులకు బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని నిలదీస్తే, కమిషన్ల కోసం ఆ ఫ్యాక్టరీ భూములు విక్రయించారని అన్నారు. అంతకు ముందు కూడా రూ.150కోట్ల విలువగల ఈ ఫ్యాక్టరీని ఎన్‌సిఎస్ యాజమాన్యానికి రూ.13కోట్లకు కట్టబెట్టిందని గుర్తు చేశారు.

అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజన కార్మికులు తదితర స్కీమ్ వర్కర్లపై పనిభారం పెంచినప్పటికీ, వేతనాలు పెంచలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ విమర్శించారు. 95శాతం హామీలు అమలు చేసినట్టు చెప్పుకుంటున్న జగన్మోహన్‌రెడ్డి వేతనాల పెంపు విషయమై అంగన్‌వాడీలకిచ్చిన మాట ఎందుకు తప్పారని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓట్లు దండుకోవడానికే వైసిపి సామాజిక సాధికారిక యాత్ర చేపట్టిందన్నారు. వైసిపితోపాటు టిడిపి, జనసేన కూడా బిజెపి ఏం చేసినా తానా అంటే తందాన అంటూ కొమ్ముకాస్తున్నాయని విమర్శించారు. మోడీ, జగన్ అనుసరిస్తున్న విధానాలు ఉద్యోగ, ఉపాధిని దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ జీగిరాం జ్యూట్ మిల్లు కార్మికులు, అంగన్‌వాడీలు, సాలూరు, మక్కువ, మెంటాడ మండలాలకు చెందిన గిరిజనులు, గుర్లగెడ్డను పూర్తిచేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలంటూ రైతులు యాత్రకు నాయకత్వం వహిస్తున్న శ్రీనివాసరావుకు వినతులు అందజేశారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడారు. పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ నాయకులు కోరాడ ఈశ్వరరావు, ఎన్‌వై నాయుడు, సీదరపు అప్పారావు, విజయనగరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు పి.రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ ఏజెన్సీలో గిరిజనులు దోపిడీకి గురవుతున్నారని, తాగడానికి మంచినీరు కూడా వైసిపి ప్రభుత్వం అందించడం లేదన్నారు. కనీస సౌకర్యాలు లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గిరిజనులకు ప్రాతినిధ్యం వహిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర ఈ బురద నీరు తాగ గలరా అని ప్రశ్నించారు. గిరిజన గ్రామాలకు రోడ్లు వేయకుండా విశాఖ నుంచి రాయపూర్‌కు వేల కోట్లు పెట్టి రోడ్లు వేస్తున్నారని అన్నారు.

సీనియర్ నాయకులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షా 80 వేలతో పేదలు ఎలా ఇళ్లు కడతారని ప్రశ్నించారు. కనీసం యూనిట్ విలువ ఐదు లక్షల రూపాయలు వుండాలన్నారు. కేరళలో కమ్యూనిస్టు ప్రభుత్వం ఆరు లక్షల రూపాయలతో ప్రభుత్వమే పేదలకు ఇళ్ల నిర్మాణం చేపడుతోందని చెప్పారు. వైసిపి ఎమ్మెల్యేలు మంత్రులు భూములు, ఇసుక, మట్టి దోపిడీ చేస్తున్నారని విమర్శించారు.

వినతులు స్వీకరిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

లక్ష్యాలు పూర్తిచేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పదో తరగతి ఉత్తీర్ణతలో గత ఏడాది మాదిరిగానే రాష్ట్రంలో ఉత్తమ ఫలితాలను సాధించాలని, ప్రభుత్వశాఖలకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని కలెక్టరు నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరు కార్యాలయం నుండి మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యాశాఖ, హౌసింగు, గ్రామీణ నీటి సరఫరా, రీసర్వే, ఓటరు నమోదు, బాల్యవివాహాలు, శిశుసంక్షేమశాఖ, గడపగడపకు మనప్రభుత్వం, ప్రాధాన్యతా భవనాలు నిర్మాణం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. విద్యాశాఖకు సంబంధించి టెన్త్‌లో ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. జలజీవన్ మిషను పనులను ఫిబ్రవరి నాటికి శతశాతం పూర్తిచేయాలని, పూర్తయిన పనుల సర్టిఫికెట్లను హర్ ఘర్ జల్ నందు పొందుపరచాలని తెలిపారు. జలజీవన్ మిషన్‌కు సంబంధించిన బిల్లులను చెల్లించడం జరిగిందని, పనులు పెండింగు పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే మూడో విడత రీసర్వే పనులు షెడ్యూలు ప్రకారం పూర్తిచేయాలని, ఫైనల్ ఆర్‌ఒఆర్ పూర్తయిన గ్రామాల్లో గల సిబ్బంది సేవలను మూడో విడత గ్రామాల్లో వినియోగించుకోవాలన్నారు. రీసర్వేలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని, ఫిర్యాదులు ఎక్కువగా వచ్చే గ్రామాల్లో ప్రత్యేక క్యాంపు నిర్వహించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఓటరు సవరణకు సంబంధించి డిసెంబరు నాటికి మార్పులు, చేర్పులకు సంబంధించి ఆమోదం పొందిన దరఖాస్తులను పరిష్కరించాలని తెలిపారు. ఎటువంటి లోపాలు లేకుండా ఫైనల్ లిస్టు తయారుచేయాలని, దానిపై ఎటువంటి ఫిర్యాదులు రాకూడదన్నారు. స్త్రీ, శిశు సంక్షేమానికి సంబంధించి రక్తహీనత, పౌష్టికాహార లోపాలను అరికట్టేందుకు సచివాలయం వారీగా రూపొందించిన ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. గృహనిర్మాణాలకు సంబంధించి జగనన్న కాలనీలకు విలువైన స్థలాలను కేటాయించడం జరిగిందని, లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలు పూర్తిచేయాలని, లేఅవుట్లలో నిర్మాణాలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు నీటి, రహదారి వసతి ఏర్పాట్లు చేయాలని గృహనిర్మాణ, ఇంజనీరింగు అధికారులను ఆదేశించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనులకు గానూ జిల్లాకు రూ.35 కోట్లు నిధులు మంజూరయ్యాయని, ప్రస్తుతం రూ.9 కోట్లకు మాత్రమే పనులు ప్రతిపాదించాలని తెలిపారు. ప్రాధాన్యతా భవనాలను డిశంబరు 10వ తేదీనాటికి పూర్తిచేసి అప్పగించాలని తెలిపారు. సమావేశంలో జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావు, డిఆర్‌ఒ జె.వెంకటరావు, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'కు మైదానాలు సిద్ధం చేయాలి

పార్వతీపురం: ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీల నిర్వహణకు మైదానాల వివరాలను పంపించాలని కలెక్టరు మండల అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిశంబరు 11 నుంచి జనవరి 15వరకు నిర్వహించే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమ ఏర్పాట్ల పరిశీలనకు ప్రత్యేకాధికారిగా జాయింట్ కలెకర్ గోవిందరావును నియమించామని, జిల్లాలో క్రీడల నిర్వహణకు ప్రతి గ్రామం, మండల స్థాయిలో క్రీడా మైదానాలు సిద్ధం చేయాలని తెలిపారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు 'ఆరు అంశాలలో పోటీల నిర్వహణకు జిల్లాలో 6వేల పోటీలు జరగనున్నాయని తెలిపారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడలతో పాటు 3కే మారథాన్, యోగా, టెన్నికాయిట్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని, జిల్లా వ్యాప్తంగా 350 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రభుత్వం నుంచి మంజూరైన క్రీడా కిట్లను ఆయా సచివాలయాలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జెసి ఆర్. గోవిందరావు, డిఆర్‌ఒ జె.వెంకటరావు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పార్కు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పర్యాటక అభివృద్ధి పనులు వేగవంతం

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

పర్యాటక అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మండలంలోని నవరకోటపాడు హార్టికల్చరల్ నర్సరీ ట్రైనింగు సెంటర్‌ను పర్యాటక పార్కుగా చేస్తున్న అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఒక్కొక్కటి పది లక్షల విలువ గలిగిన క్యాంటీన్, షాపింగ్ కాంప్లెక్స్, టాయిలెట్స్, ఆర్చ్, గేటు, పార్కింగ్, కాటేజు పనులను నవంబరులో పూర్తిచేయాలని ఆదేశించారు. రూ.20లక్షలు, రూ.15లక్షలతో నిర్మిస్తున్న కాటేజీలను, రూ.10లక్షలతో చేపట్టిన చెరువు అభివృద్ధి పనులను డిసెంబరు 15 నాటికి పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పార్కులో సందర్శకులకు కావాల్సిన సదుపాయాలు కల్పించాలని, జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు జె శాంతీశ్వర రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

మృతుల కుటుంబాలకు రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

విజయనగరం జిల్లా కొత్తవలస వద్ద జరిగిన రైలు ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ పాచిపెంటలోని గాంధీ బొమ్మ ఆవరణలో సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన జరిగింది. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు బోను గౌరినాయుడు, చింత పోలిరాజు, ఎస్ రామారావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ నిత్యం రైలు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రమాదాలు జరగకుండా సిగ్నల్స్ ప్రాబ్లమ్స్‌ను సరైన పద్ధతిలో పెట్టాలన్నారు. రైల్వేలో ఖాళీ పోస్టులు భర్తీ చేసి సిగ్నల్ సామర్థ్యాన్ని పెంచుకుంటూ ప్రమాదాలు లేకుండా చూసే బాధ్యత కేంద్ర ప్రభుత్వాన్నిదేనన్నారు. కానీ నరేంద్ర మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా భద్రత చర్యలు చేపట్టాలని కోరారు.

పరీక్షా కేంద్రాలు పరిశీలన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలో ఈనెల 3న స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్మెంట్ సర్వేస్ పరీక్ష నిర్వహించనున్న సందర్భంగా మంగళవారం మండల విద్యాశాఖ అధికారి డి.గౌరునాయుడు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యం పెంచేందుకు వీలుగా 3,6,9 తరగతులకు సంబంధించి పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని 24 పాఠశాలల్లో పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. అలాగే మధ్యాహ్న భోజనం, రికార్డుల పరిశీలన పాఠశాల ప్రాంగణం పరిశుభ్రంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయనతో పాటు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌లో నిబంధనలు అమలు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రంలో మున్సిపాల్టీ పరిధిలో బైపాస్ రోడ్డు పక్కనే సూర్యఆదిత్య ట్రేడ్ ఫేర్ వారి ఫారన్ సిటీ ఎగ్జిబిషన్‌లో ఉన్న లోపాలు సరిచేసి ప్రభుత్వ నిబంధనలు అమలు చేయాలని మంగళవారం ఆర్‌డిఒ కార్యాలయం ఎఒ రామస్వామికి పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు, ఎన్.గౌరి, జవ్వాది పోలిరాజు, సామంతుల గౌరి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ ఎగ్జిబిషన్‌లో ఉన్న ప్రవేశ ఫీజు రూ.50 రద్దు చేయాలని, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, మహిళలకు, పిల్లలకు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రమాదాలు జరగకుండా మెడికల్ కిట్లు ఉంచాలని, అగ్ని ప్రమాదాలు, షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా ఇసుక, నీళ్లు, ఆక్సిజన్ సిలండర్లు వంటివి ఏర్పాటు చేయాలని, ధరల నియంత్రణ పట్టిక బోర్డు ఉంచాలని, ఆరోగ్యానికి హాని కలిగించే నాసిరకమైన దినసులతో తయారు చేసిన తిను పదార్థాలు అమ్మరాదని, పురుగులు, దోమలు, విషజంతువులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

న్యాయం జరగకపోతే పదవి వదులుకుంటారా ?

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఉపాధ్యాయులకు నవంబర్‌లోగా పాత బకాయిలు చెల్లించడానికి ముఖ్యమంత్రి అంగీకారం తెలిపారని ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం) చంద్రశేఖరరెడ్డి తెలిపారని, అందుకు సంతోషమని పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అమరపు సూర్యనారాయణ అన్నారు. అయితే నవంబర్‌లోగా పాత బకాయిలు ఇప్పించని పక్షంలో మీరు ఉద్యోగుల పేరు చెప్పి అనుభవిస్తున్న పదవిని వదులుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అమరాపు విలేకరులతో మాట్లాడుతూ పాత బకాయిలు ఎన్ని ఉన్నాయో తెలుసా అని చంద్రశేఖరరెడ్డిని ప్రశ్నించారు. ప్రభుత్వ అధినేత దగ్గర మంచి కోసం ఇలా ప్రకటనలు చేయడం సరికాదన్నారు. నవంబర్ లోగా పాత బకాయిలు విడుదల కాని పక్షంలో డిసెంబర్ మొదటి వారంలో మీరు పదవి వదులుకోవాలని, లేని పక్షంలో రోడ్లు మీద మీరు తిరగలేరని సూర్యనారాయణ తెలిపారు. సరిగ్గా 30 రోజుల సమయం ఉందని, త్వరితగతిన బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండలంలోని ఉల్లిభద్రలో గల అంగన్వాడీ కేంద్రాన్ని ఆనుకుని ఉన్న చెట్లు మీదుగా విద్యుత్ తీగెలు ఉండడంతో చిన్నారులకు ఎప్పుడు ఏం ప్రమాదం సంభవిస్తుందోనన్న భయాందోళనలో తల్లిదండ్రులు ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రం పక్కనే ఉన్న వెలగ చెట్టు, నీలగిరి చెట్లు మీదుగా విద్యుత్ తీగెలు ఉండడం వల్ల ప్రమాదం పొంచి ఉందని తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈ కేంద్రానికి పంపించిన పిల్లలు తిరిగి ఇంటికి వచ్చినంత వరకు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ కేంద్రంలో 20మంది చిన్నారులు ఉన్నారు. కావున తక్షణమే విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి చెట్లు మీదుగా ఉన్న విద్యుత్ తీగెలను సరి చేయాలని కోరుతున్నారు.

విద్యుత్ తీగలకు తాకిన చెట్లు కొమ్మలు

కోరన్న, మంగన్న స్ఫూర్తితో ఉద్యమిద్దాం

గిరిజన హక్కులను కాపాడుకునేందుకు సిద్ధం కావాలి
సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి

కురుపాం : వర్ధంతి సభలో మాట్లాడుతున్న సిపిఎం సీనియర్ నాయకులు కృష్ణమూర్తి

కోరన్న, మంగన్న స్థూపం వద్ద నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కురుపాం

కోరన్న, మంగన్న స్ఫూర్తితో గిరిజన హక్కులను కాపాడుకునేందుకు ఐక్యమై ఉద్యమించాలని సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని నీలకంఠపురం పంచాయతీ మామిడిమానుగూడలో కోరన్న, మంగన్న 56వ వర్ధంతి మంగళవారం జరిగింది. సభలో ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ 1960లో జరిగిన గిరిజనులచే భూస్వాములు, జమీందారులు వెట్టిచాకిరీ చేయిస్తుంటే గిరిజనుల హక్కుల కోసం భూస్వాములకు, జమీందారులకు, పెత్తందార్లకు వ్యతిరేకంగా జరిగిన గిరిజన రైతాంగ ఉద్యమంలో కోరన్న, మంగన్న అమరులయ్యారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నూతన అటవీ విధానం పేరుతో గిరిజనులను అడవుల నుంచి తరిమివేయడానికి ప్రయత్నిస్తోందని, దీనిపట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. వీటన్నింటికీ వ్యతిరేకంగా పోరాటానికి గిరిజనులంతా ఏకతాటిపై వచ్చి కమ్యూనిస్టు పార్టీతో కలసి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కె.అవినాష్ మాట్లాడుతూ కేబిజెపి ప్రభుత్వం 1/70 చట్టాన్ని ఎత్తి వేయడానికి ప్రయత్నిస్తుందని, గిరిజనులు భూములన్నీ పెత్తందార్ల చేతుల్లోకి వెళ్లాయని ఈ ప్రాంతాన్ని కూడా అలా చేయడానికి చూస్తున్నారని అన్నారు. కావున కోరన్న, మంగన్న స్ఫూర్తితో ఈ ప్రభుత్వ విధానాలకు నిరసనగా పోరాడాలని పిలుపునిచ్చారు. చెముడుగూడ ఎంపిటిసి సభ్యులు ఎం.రమణ మాట్లాడుతూ గిరిజనులకు రిజర్వేషన్ లేకుండా చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూస్తున్నాయని విమర్శించారు. వీటన్నింటికి వ్యతిరేకంగా గిరిజన హక్కుల కోసం కోరన్న, మంగన్న స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, కుక్కిడి సర్పంచ్ బిడ్డిక రాజారావు, కురుపాం సిపిఎం మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, నాయకులు బిడ్డిక శంకర్రావు, ఎం.సన్యాసిరావు, బిడ్డిక వెంకట్రావు, గుమ్మలక్ష్మీపురం సిఐటియు నాయకులు కె.గౌరీశ్వరరావు, గిరిజనులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: అమరవీరుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. కోరన్న, మంగన్న సంస్మరణ సభ గుమ్మలక్ష్మీపురంలో ఉన్న ఎర్రజెండా స్థూపం వద్ద నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల సమస్యలు పోరాటం ద్వారానే పరిష్కారమవుతాయని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కోలక అవినాష్, మండంగి రమణ, శంకర్రావు, సన్యాసిరావు, మోహన్ రావు, సిఐటియు మండల కార్యదర్శి కె.గౌరీశ్వరరావు తదితరులు ఉన్నారు.

పార్వతీపురం టౌన్ : స్థానిక గిరిజన భవన్ వద్ద రైతు కూలి సంఘం (ఆం.ప్ర) ఆధ్వర్యంలో జిల్లా సహాయ కార్యదర్శి పాపల శ్రీను నాయుడు అధ్యక్షతన సభ నిర్వహించారు. సభ అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు కూలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్. యూస్సీ, రాష్ట్ర సహాయ కార్యదర్శి దంతులూరి వర్మ, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు ఊయక ముత్యాలు, ఉపాధ్యక్షులు పీడిక అసిరి, కంద్రక వెంకటస్వామి, రైతు కూలీ సంఘం నాయకులు మొనింగి భాష, సిరివరపు విశ్వేశ్వరరావు ప్రసంగించారు. కార్యక్రమంలో రైతులు, గిరిజనులు, మహిళలు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : కోరన్న, మంగన్న లాంటి వారి పోరాటాలతో, ప్రాణ త్యాగాలతో సాధించుకున్న హక్కుల రక్షణ కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ అన్నారు. కోరన్న, మంగన్న ల వర్ధంతి సభ మండలంలోని లిడికివలసలో నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షులు తాడంగి సాయిబాబు అధ్యక్షతన జరిగిన సభలో ఎంపిటిసి సభ్యులు ఓటక సుందరరావు, ఉర్లక నాగార్జున, సురేష్, ప్రభాకర రావు, దేవ్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు గిరిజన మహిళలు థింసా, కోలాటం, సాంప్రదాయ నృత్యాలు చేశారు.

కొమరాడ : శ్రీకాకుళ గిరిజన రైతాంగ సాయుధ పోరాట యోధులు కోరన్న, మంగన్నలు పోరాట స్ఫూర్తితో దోపిడీ, పీడనల విముక్తి కోసం పోరాడాలని ఎఐకెఎమ్ఎస్ జిల్లా కమిటీ సభ్యులు సంబుడు జయలక్ష్మి అన్నారు. అఖిల భారత రైతు-కూలీ సంఘం (ఏ.ఐ.కె.ఎం.ఎస్), అఖిల భారత ఆదివాసీ వేదిక (ఏ.ఐ.టి.ఎఫ్)ల ఆధ్వర్యంలో మండలంలోని చినకేర్జల పంచాయితీ గ్రామంలో నివాళి కార్యక్రమం చేపట్టారు. శ్రీకాకుళ సాయుధ పోరులో అమరులైన వీరుల బాటలో పయనించి, నేటి కేంద్ర, రాష్ట్ర పాలకులు అనుసరిస్తున్న ఆదివాసీ, ప్రజా వ్యతిరేక విధానాలను ఎదిరిస్తామని ఆదివాసీలు ప్రతినబూనారు. కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ జిల్లా కమిటీ సభ్యులు పీడక చిరంజీవులు, పి.ఓ.డబ్ల్యు జిల్లా కమిటీ సభ్యురాలు నూకమ్మ మరియు ఆదివాసీలు పాల్గొన్నారు.

చంద్రబాబు విడుదలపై హర్షాతిరేకాలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

టిడిపి అధినేత చంద్రబాబుకు హైకోర్టు మంజూరు చేసిన మధ్యంతర బెయిల్‌పై విడుదల పట్ల నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర సంతోషం వ్యక్తం చేశారు. టిడిపి కార్యాలయం ఎదుట బాణాసంచా కాల్చారు. పట్టణంలో ఐటీడీపీ నాయకుడు బార్నాల సీతారాం ఏడవ వార్డు కౌన్సిలర్ కోరాడ నారాయణరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు.

భామిని : స్థానిక అంబేద్కర్ కూడలిలో టిడిపి నాయకులు కేకు కట్ చేసి బాణా సంచా కాల్చుతూ ఎప్పటికైనా సత్యమే గెలుస్తుందంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు భోగాపురపు రవినాయుడు, ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్వరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం : చంద్రబాబు నాయుడు విడుదలైన సందర్భంగా స్థానిక బజారు నుంచి హనుమాన్ జంక్షన్ వరకు ఊరేగింపుగా వచ్చి బాణాసంచాలు పేల్చి, ఆంజనేయ విగ్రహం వద్ద కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు కొల్లి తిరుపతిరావు, రౌతు వేణుగోపాలనాయుడు, మండల కమిటీ సభ్యులు బి.శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు, పెద్దబ్బాయి, దాసరి శివన్నాయుడు, పెదబోగిలి సర్పంచ్ జొన్నాడ తెరేజమ్మ, గరికయ్య తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : చంద్రబాబు విడుదలైన సందర్భంగా నియోజకవర్గ నాయకులు పడాల భూదేవి కార్యకర్తలకు స్వీట్లు పంచుతూ, బాణా సంచా కాల్చి ఆనందం పంచుకున్నారు.

వీరఘట్టం : స్థానిక అంబేద్కర్ జంక్షన్ వద్ద టిడిపి నాయకులు సంబరాలు జరిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఉదయాన ఉదయ భాస్కర్, తెలుగు యువత అధ్యక్షులు పారిచర్ల వెంకట రమణ, మండల యువత అధ్యక్షులు మాచర్ల అనిల్, మండల ప్రధాన కార్యదర్శి చింత ఉమామహేశ్వరరావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : జియమ్మవలస మండలం పెద్దబుడ్డిడి, ఇటిక, చినకుదమ గ్రామాల్లో టిడిపి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు గురాన శ్రీరామ్మూర్తి, టిడిపి అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, టిడిపి ఎస్టీ సెల్ అరకు పార్లమెంటరీ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరంలో బాణా సంచా పేల్చుతున్న టిడిపి నాయకులు

సాలూరు రూరల్ : మండలంలోని మామిడిపల్లిలో టిడిపి నాయకులు బాణా సంచా పేల్చుతూ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్, రైతు సంఘం అధ్యక్షులు బూస తవుడు, తడుతూరి తిరుపతిరావు, డొంక అన్నపూర్ణ, కరుణ, భారతి, రవణమ్మ, మజ్జి శ్రీను పాల్గొన్నారు.

కురుపాం : టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్చార్జి టి. జగదీశ్వరి ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ వద్ద చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి స్వీట్లు పంచుతూ, మందు గుండు సామాగ్రిని పేల్చారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కెవి కొండయ్య, ఎఎంసి మాజీ చైర్మన్ కోల రంజిత్ కుమార్, టిఎన్ఎస్ఎఫ్ మీడియా కోఆర్డినేటర్స్ సుకేష్ చంద్రపండా, టిడిపి నాయకులు కిమిడి రామరాజు, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు విడుదలపై లావణ్య హర్షం

కురుపాం : చంద్రబాబు నాయుడు విడుదలైన సందర్భంగా కురుపాం నియోజకవర్గ టిడిపి యువ నాయకులు, టికెట్ ఆశావాహురాలు పువ్వల లావణ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడును అన్యాయంగా అక్రమంగా అరెస్టు చేసి జైల్లో ఉంచి మానసిక క్షోభకు, అనారోగ్యానికి గురిచేసి, అనవసరమైన అక్రమ కేసులు బనాయించి అనేక రకాలుగా ఇబ్బందులు చేస్తున్న వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. రానున్న ఎన్నికల్లో కచ్చితంగా టిడిపిని ప్రజలు గెలిపించుకోవడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు.

సాదాసీదాగా కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నగర పంచాయతీ చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశం సాదాసీదాగా జరిగింది. సకాలంలో సభ్యులు హాజరు కాకపోవడంతో ఉదయం 10.30గంటలకు జరగాల్సిన సమావేశం మధ్యాహ్నం 12గంటల వరకు ప్రారంభం కాలేదు. ప్రధాన అంశాలు కూడా ప్రస్తావనంలోకి రాలేదు. వైస్ చైర్మన్ పల్లా ప్రతాప్ మాట్లాడుతూ డంపింగ్ యార్డు సమస్య త్వరగా పరిష్కరించాలన్నారు. దీనిపై కమిషనర్ సర్వేశ్వరరావు మాట్లాడుతూ ఈ సమస్య జిల్లా కలెక్టర్ దృష్టిలో ఉందని చెప్పారు. వీధి దీపాలకు ప్రతినెలా నిధులు కేటాయించాలని సభ్యులు కిలారి మోహన్ కోరారు. సమావేశంలో సభ్యులు దుప్పాడ పాపినాయుడు, వెలమల మన్మధరావు, కడగల రమణ, కాంతారావు, ఆకుల కుమార్, తూముల లక్ష్మణ, కె.అరుణ, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న ఎస్ సొసైటీ సభ్యులు

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ

ప్రజాశక్తి - కురుపాం

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ టెస్ట్(ఎన్.ఎం.ఎం.ఎస్) కోసం సన్నద్ధవుతున్న స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్ సొసైటీ ఆధ్వర్యంలో యూత్ ఫర్ సేవ విశాఖ సంస్థ వారి సహకారంతో ఎంఇఒ ఎన్.సత్యనారాయణ చేతుల మీదుగా మంగళవారం విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది కూడా ఎస్ సొసైటీ స్టడీ మెటీరియల్ అందించిన సహకారంతో ఆరు గురు విద్యార్థులు స్కాలర్ షిప్ పొందేందుకు అర్హత సాధించారని, వారిని ఆదర్శంగా తీసుకుని ఈ ఏడాది కూడా స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకొని మరింత మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.శంకర్రావు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పలుచోట్ల జాతీయ సమైక్యతా దినోత్సవం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

భారత మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం దేశ సమైక్యత, సమగ్రతలకు అంకితభావంతో పాటుపడదామని రిజర్వు ఇన్స్పెక్టర్ కుమార్ అధికారులు, సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణ నుండి రన్ ఫర్ యూనిటీ (2కెరన్) ను ప్రారంభించారు. ఈ 2కె రన్ పోలీస్ కార్యాలయం నుండి వైకెఎంనగర్ జంక్షన్, కోర్టు రోడ్డు మీదుగా ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో పట్టణ సిఐ కృష్ణారావు, రిజర్వు ఇన్స్పెక్టర్లు కుమార్, శ్రీనివాసరావు, పట్టణ ఎస్ఐ దినకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న పోలీసు అధికారులు

వీరఘట్టం: మండలంలో జాతీయ సమైక్యత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఎంవి పురంలో ఎంఇఒ ఆర్.ఆనందరావు విద్యార్థులచే గ్రామంలో ర్యాలీ నిర్వహించి అనంతర ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం తోపాటు సీఆర్పీలు జగదీష్, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకొండ : జాతీయ సమైక్యత దినోత్సవం, సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జూనియర్ కళాశాల (బాలురు)లో జాతీయ సమైక్యత దినోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షులు పైల శంకరరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెలమల అప్పారావు, సీనియర్ అధ్యాపకులు తేజేశ్వరరావు, గోవిందరావు, శివానంద వెంకటేశ్వరరావు, నారాయణరావు, విజయరాజ్, చంద్రరావు, గిరిబాబు, ఫిజికల్ డైరెక్టర్ నాగభూషణరావు పాల్గొన్నారు.

సీతంపేటలో పటేల్‌కు నివాళ్లు అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సాలూరు రూరల్ : స్థానిక ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి ఆధ్వర్యంలో జాతీయ ఐక్యతాదినోత్సవం, 3కే రన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు .

సాలూరు: జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా మంగళవారం అంగన్వాడీ కార్యకర్తలు జాతీయ రహదారిపై మానవహారం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్ వైజర్ తిరుపతమ్మ ఆధ్వర్యాన కార్యకర్తలు రెవెన్యూ కార్యాలయం జంక్షన్‌లో మానవహారం చేపట్టారు. అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు నాయకులు బి.రాధ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాలలో విద్యార్థులు పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పాఠశాల కరస్పాండెంట్ కోడూరు సాయి శ్రీనివాసరావు ఆధ్వర్యాన ఉపాధ్యాయులు, విద్యార్థులు పటేల్‌కు నివాళి అర్పించారు.

సీతంపేట: స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ ఐక్యత దినోత్సవం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని రాష్ట్రీయ ఏక్తా దివస్‌గా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి హాజరయ్యారు. పటేల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన స్ఫూర్తితో యువత ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. వల్లభాయ్ పటేల్ గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలపై సిపిఎం నాయకులకు వినతి

ప్రజాశక్తి - కొమరాడ

కురుపాంలో సోమవారం జరిగిన ప్రజా రక్షణ భేరి కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం పొలిట్‌బ్యూరోసభ్యులు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు మండలంలోని ప్రధాన సమస్యలపైన వినతి పత్రం అందజేసినట్టు ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి తెలిపారు. మండలంలో ప్రధానంగా 14ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పూర్ణపాడు-లాబేసు వంతెన పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని కోరారు. అలాగే ఏనుగుల బెడద నుంచి ప్రజలను కాపాడాలన్నారు. అంతరాష్ట్ర రహదారి మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ఏ ఉపేంద్ర పాల్గొన్నారు.

నాటు సారా క్యాన్లును పట్టుకున్న ఎక్సైజ్ పోలీసు అధికారులు

నాటు సారా రవాణాపై దాడులు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం ఒడిషా రాష్ట్రం నుండి అక్రమంగా నాటు సారా రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు మండలంలోని ఎంఆర్ నగరం సమీపంలో ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని 120 లీటర్ల నాటు సారాను సీజ్ చేశారు. బాలగుడబకు చెందిన బంగారి రాజశేఖర్‌పై దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు. అలాగే పార్వతీపురం మున్సిపాల్టీ శివారులో గల నవిరికాలనీ వద్ద నాటు సారా అమ్ముతున్న మీసాల రవిపై కేసు నమోదు చేసి 200 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ దాడుల్లో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర, ఎస్ఐ రమణ,సిబ్బంది పాల్గొన్నారు.

జెఎఎస్‌తో ప్రజలకు ఆరోగ్య రక్ష

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల ఆరోగ్యానికి సంపూర్ణ రక్షణ అని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని ములగ సచివాలయం పరిధిలో గల నడిమిములగలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రోగులకు అందుతున్న ఆరోగ్య పరీక్షలతో పాటు అక్కడ వైద్య పరీక్షలు, ఉచిత మందులు పంపిణీ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిపి మజ్జి శోభారాణి, తహశీల్దార్ శివన్నారాయణ, ఇఒపిఆర్‌డిఒ, వైద్యాధికారులు, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, స్థానికులు పాల్గొన్నారు.

డిఎంహెచ్ఒ పరిశీలన

మండలంలోని ములగలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు మంగళవారం తనిఖీ చేశారు. శిబిరంలో ఏర్పాటు చేసిన అన్ని కౌంటర్లను, ప్రత్యేక వైద్యుల కౌంటర్లను పరిశీలించారు. వైద్యులు, వైద్య సిబ్బందితో మాట్లాడి శిబిరంలో అందించాల్సిన వైద్య సేవలను వివరించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను సందర్శించి శిబిరానికి వచ్చే ప్రజలకు గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహార ప్రయోజనాలు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్.ఎస్.బి. కె ప్రాజెక్టు అధికారి డా ధవళ భాస్కరరావు, స్థానిక వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని తామరకండి గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా శిబిరాల్లో గుర్తించిన రోగులకు ఉచితం వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కృష్ణమహేశ్‌రెడ్డి, ఎంపిపి ప్రతినిధి బి.శ్రీరాములునాయుడు, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జి, ఎంపిటిసి సభ్యులు శ్రీనివాసరావు, సర్పంచ్ ఎం.లలితతో పాటు పలువురు పాల్గొన్నారు.

సీతానగరం వైద్యశిబిరంలో వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జోగారావు

నాణ్యమైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి - కురుపాం

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో వచ్చిన వారిని నాణ్యమైన వైద్యమందించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు అన్నారు. మంగళవారం కురుపాంలో గల శివన్నపేటలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆకస్మికంగా ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న వైద్య సేవలను నేరుగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సిబ్బంది నమోదు చేసిన ప్రజల ఆరోగ్య వివరాలు రికార్డులో తనిఖీ చేసి శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ సక్రమంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం అంగన్వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాల్స్ ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి గొర్లి సుజాత, మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, వైద్యాధికారులు కె. సుప్రియ, శంకర్, శ్రీధర్ , వైసీపీ జిల్లా గ్రీవెన్స్ అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, పంచాయతీ సెక్రటరీ అనిత , సచివాలయం సిబ్బంది,అంగన్వాడీ సిబ్బంది,గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.